క్లుప్తంగా

పనుల్లో వేగం పెంచాలి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం కిషన్‌నగర్ వద్ద చేపట్టిన ఐకేపీ భవన సముదాయంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాడు. కార్యక్రమంలో పీఆర్ డీఈ సదాశివారెడ్డి, ఏఈ స్నేహ తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల సమ్మె విరమణ

కొండపాక(గజ్వేల్): సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీ కార్మికులు 35 రోజులుగా కొనసాగించిన సమ్మె బుధవారం విరమించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు కార్మికులు తెలిపారు. 15 రోజుల్లో హామీని నిలబెట్టుకోకపోతే మళ్లీ సమ్మె బాట పడతామని హెచ్చరించారు. సమ్మెను విరమించి విధుల్లో చేరుతున్నట్లు కలెక్టరేట్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి రహమాన్‌కు పత్రం అందజేశారు.

మిరుదొడ్డి తహసీల్దార్‌గా గోవర్ధన్



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి తహసీల్దార్ గోవర్ధన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నుంచి బదిలీపై వచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భూ సంబంధ విషయాలపై దళారులను ఆశ్రయించకుండా నేరుగా వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇక్కడ పనిచేసిన ఉదయశ్రీ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ గ్రామ సర్పంచ్ చిత్తారిగౌడ్, ఎంపీటీసీ అల్లి శేఖర్‌రెడ్డి గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఉప్పర్‌పల్లికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో గ్రామస్తులు చాలా ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. స్పందించిన మేనేజర్ మాట్లాడుతూ రూట్ సర్వేచేసి పరిశీలిస్తామన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల కమిటీ ఏర్పాటు

రాయపోలు(దుబ్బాక): విద్యాశాఖలో సమగ్ర శిక్షా ఉద్యోగుల రాయపోలు మండల జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటుచేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. విద్యాశాఖలో పనిచేసే ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీసీఓ, సీఆర్పీలు, కేజీబీవీ ప్రత్యేకాధికారి, సీఆర్టీలు, అకౌంటెంట్స్, ఐఈఆర్పీలు, పీటీఐ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. వీరికి మండల శాఖ అధ్యక్షుడుగా సీఆర్పీ యాదగిరి, ఉపాధ్యక్షురాలుగా రజిత, ప్రధాన కార్యదర్శిగా అనిత, కోశాధికారిగా కుమార స్వామి, పలువురు కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

సహజ వనరుల వినియోగంపై అవగాహన

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రకృతిలో లభించే సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఈఈఎస్ఎల్ (ఎనర్జీ ఎసెన్షియల్ సరీ్వస్ లిమిటెడ్) రీజినల్ సౌత్ ఈస్ట్ క్లస్టర్ కో ఆర్డినేటర్ సావిత్రి సింగ్ అన్నారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మిరుదొడ్డి ఉన్నత పాఠశాలలో శక్తి వనరులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చార్జింగ్ సైకిల్ వినియోగంపై అవగాహన కల్పించి విద్యార్థులకు ఎల్‌ఈడీ బల్బులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల సాయిలు, ఎంఈఓ ప్రభుదాసు, హెడ్ మాస్టర్, ఎంపీటీసీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూఎస్పీసీ (ఐక్య ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి) జిల్లా నాయకుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ధర్నా, ర్యాలీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 12న జిల్లా కేంద్రంలో ధర్నా, ర్యాలీతో పాటుగా సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆధార్ సేవలు

హుస్నాబాద్: పోస్టాఫీస్‌ల్లో కొత్తగా ఆధార్ సేవా కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చామని ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ డివిజన్ పోస్టాఫీస్ ఇన్‌స్పెక్టర్ రాజు బుధవారం సూచించారు. ఆధార్ కార్డులో పేర్ల సవరణ, కొత్త ఆధార్ కార్డు, చిన్న పిల్లలకు ఆధార్ కార్డు జారీ చేస్తారన్నారు.

పోటా పోటీ ర్యాలీలు

- వ్యాపార సంస్థల బంద్‌కు విపక్షాల ర్యాలీ
- విఫలం చేసేందుకు అధికార బీఆర్ఎస్ యత్నం



ర్యాలీలో నినాదాలు చేస్తున్న అధికార పార్టీ నాయకులు



అఖిలపక్ష నాయకుల ర్యాలీ

బెజ్జంకి(సిద్దిపేట): సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు జీపీ కార్మికులు మంగళవారం వినతి పత్రం ఇచ్చే క్రమంలో బీఎస్పీ, బీఆర్ఎస్ నాయకులకు మధ్య జరిగిన వాగ్వాదం చివరకు అఖిలపక్ష బంద్ పిలుపునకు దారితీసింది. బుధవారం కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం నాయకులు బెజ్జంకి ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టి అధికార పార్టీ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యాపార సంస్థలను బంద్ చేయిస్తున్న క్రమంలో మరోవైపు నుంచి బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు మద్దతుగా నినాదాలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని ఎమ్మెల్యేపై అనుచిత వాఖ్యలు సహించమంటూ హెచ్చరిస్తూ దుకాణాలను తెరిపించారు. దీంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు విపక్షాలు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రం మాట్లాడుతూ శాంతియుతంగా జీపీ కార్మికుల కోసం మద్దతు తెలిపిన బీఎస్పీ నాయకులతో ఘర్షణపడటం, విపక్షాల బంద్‌ను భగ్నం చేయడం సరికాదన్నారు.

సిలికాన్ కప్పులతో ఆరోగ్యం

నంగునూరు(సిద్దిపేట): సిలికాన్ కప్పులతో మహిళలకు సైడ్ ఎఫెక్ట్ ఉండదని, నిరభ్యంతరంగా వాడుకోవాలని పర్యావరణ పరిరక్షకురాలు డాక్టర్ శాంతి మహిళలకు సూచించారు. అంక్షాపూర్, ఖానాపూర్ గ్రామాల్లో రుతుచక్రంపై అవగాహన కల్పించి మెన్‌సవల్ సిలికాన్ కప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డైపర్లు, రసాయనిక ప్యాడ్ల వాడకంతో కేన్సర్, థైరాయిడ్ వ్యాధులబారిన పడతారన్నారు. అనంతరం సూర్యాపేట మున్సిపల్ అదనపు కమిషనర్ ప్రియాంక మాట్లాడుతూ మహిళల రుతుచక్రంపై బహిరంగంగా చర్చించే వేదికలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీపీఓ దేవకీదేవి, సర్పంచ్‌లు సత్తవ్వ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాల సేకరణ

కొండపాక(గజ్వేల్): అసలైన గృహలక్ష్మి పథకం లబ్ధిదారులను గుర్తించేందుకు సర్పంచ్ కందూరి కనకవ్వ భర్త బీసీ జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య ఇంటింటికి తిరుగుతూ వివరాలు సేకరించే కార్యక్రమం చేపట్టారు. బుధవారం కుకునూరుపల్లి మండలంలోని లకుడారంలో గృహలక్ష్మి పథకం అసలైన అర్హులను గుర్తించేందుకు ఇంటింటికి తిరుగుతున్నామన్నారు. గుడిసెల్లో నివాసం ఉండే వారికి తొలి ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. గుర్తించిన లబ్ధిదారుల జాబితాను పంచాయతీ నోటీస్ బోర్డులో ప్రదర్శించిన తర్వాత అధికారులకు అందజేస్తామని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దుబ్బాక: పట్టణంలోని 18 వార్డుకు చెందిన ముంగిశెట్టి లింగం ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. వైద్య ఖర్చుల కోసం అతడి కుటుంబ సభ్యులు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం స్పందించి రూ.10 వేలు చెక్కు రూపంలో మంజూరు చేసింది. ఈ చెక్కును బుధవారం దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత లబ్ధిదారు కుటుంబానికి అందజేశారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

హుస్నాబాద్: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లింగాల యాదయ్య డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించే నిరసన కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమణారెడ్డి, నాయకులు రాములు, ప్రభాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల గడువు పెంచాలి

కొమురవెల్లి(సిద్దిపేట): గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకునేందుకు గడువుపెంచడంతోపాటు లబ్ధిదారులను గ్రామసభలో ఎంపిక చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ రాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

హుస్నాబాద్: గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణ గడవు పెంచాలని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు బుధవారం వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అయిలేని మల్లికర్జున్ రెడ్డి వినతి పత్రం ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి రూ.3 రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు.

మద్దూరు(హుస్నాబాద్): సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు గృహలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్ష అందిస్తుందని ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యలయంలో గృహలక్ష్మి దరఖాస్తులను స్వీరించారు.

గజ్వేల్‌రూరల్: గృహలక్ష్మి దరఖాస్తుల గడువు పొడిగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పల మధుసూదన్ బుధవారం కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణపై అవగాహన

చేర్యాల(సిద్దిపేట): వరిని ఆశించే కాండం తొలుచు పురుగు నివారణపై బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన రైతు కూస కిష్టయ్య పొలాన్ని సందర్శించిన ఏడీఏ రాధిక వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. పంటల సాగులో అధికారుల సూచనలు పాటించాలన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డులో బుధవారం భవన నిర్మాణ కార్మికులకు లేబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ బాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగా వైద్య పరీక్షలను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ నవీన్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలుచేస్తే సహించం

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజల సంక్షేమానికి కృషిచేస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై అనుచిత వ్యాఖ్యలుచేస్తే సహించబోమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు. బెజ్జంకి పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులపట్ల సానుకూలమేనని కొందరు వక్రీకరిస్తూ వివాదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

గృహలక్ష్మిని సద్వినియోగం చేసుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని పేదలకు సొంత ఇంటిని నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఆయన వెంట కమిషనర్ గంగిశెట్టి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మర్కూక్(గజ్వేల్): మండలంలోని ఎర్రవల్లి గ్రామ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయానికి బుధవారం మెదక్ డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి రూ.51 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలకు తమవంతుగా విరాళం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాల్‌రాజు, నాయకులు కృష్ణ, శేఖర్, మల్లేశం, సాయి, బాలచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేరీ మట్టి మేరాదేశ్

మద్దూరు(హుస్నాబాద్): ఆజాదీ కా అమృత మహోత్సవ్‌లో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన మాజీ సైనికులను సన్మానించారు. అనంతరం నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 499 గ్రామ పంచాయతీలలో మేరీ మట్టి మేరా దేశ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించడంతో పాటు 75 మొక్కలు నాటుతున్నామన్నారు. గ్రామాల నుంచి సేకరించిన మట్టిని ఈనెల 29, 30 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో కర్తవ్యపథ్ వద్ద 7500 కలశాలతో ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇలా సేకరించిన మట్టిని కర్తవ్య పథ్‌లో అమృత వాటిక ఏర్పాటు చేసి అక్కడ మొక్కలను నాటుతామన్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భరత్ నినాదంతో కార్యక్రమాన్ని పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కంఠరెడ్డి జనార్ధన్ రెడ్డి, ఎంపీటీసీ కనకమ్మ నాగయ్య, ఎంపీడీఓ మహమ్మద్ ఖాజా మొహినుద్దీన్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, బ్లాక్ వలంటరీ చిలుక రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



వివరాలు తెలుసుకుంటున్న సూర్యాపేట జిల్లా అధికారులు

సిద్దిపేట స్వచ్ఛబడి బాగుంది

సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక

సిద్దిపేటజోన్: సిద్దిపేటలోని స్వచ్ఛ బడి బాగుందని, చెత్తను పునర్వినియోగ ప్రక్రియ బోధన వినూత్న రీతిలో ఉందని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక కితాబిచ్చారు. బుధవారం జిల్లా అధికారులతో కలిసి స్వచ్ఛబడిని సందర్శించారు. తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ, జీరో వేస్ట్ విధానం హోం కంపోస్ట్ ప్రక్రియ, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్, సర్పంచ్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్, డాక్టర్ శాంతి, కౌన్సిలర్ దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

యువతకు లెర్నింగ్ లైసెన్స్ అందజేత



లెర్నింగ్ లైసెన్స్‌లను అందజేస్తున్న నాయకులు

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గ పరిధిలో డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకున్నవారికి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సౌజన్యంతో ఉచిత లైసెన్స్ అందజేస్తున్నామని బీఆర్ఎస్‌వీ తొగుట మండల అధ్యక్షుడు పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఉచిత లైసెన్స్‌కు స్లాట్ బుక్ చేసుకున్న దుబ్బాక, అచ్చుమాయిపల్లి, పెద్ద గుండవెల్లి, తిమ్మాపూర్ రామేశ్వరంపల్లి, పోతారెడ్డి పేటకు చెందిన 273 మంది యువకులకు బుధవారం సిద్దిపేట ఆర్టీఓ కార్యాలయంలో లెర్నింగ్ లైసెన్స్‌లు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు.

చేర్యాల(సిద్దిపేట): నియోజకవర్గ పరిధిలో 18 ఏళ్లు నిండి డ్రైవింగ్ వచ్చిన యువతకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సు ఇప్పించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చేపట్టారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఆర్టీఏ కార్యాలయ ఆవరణలో లెర్నింగ్ లైసెన్సు అందజేశారు. ఈ కార్యక్రమంలో 4 మండలాల ఇన్‌చార్జి శివగారి అంజయ్య, కోఆర్డినేటర్ గుజ్జ సంపత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, మల్లన్న ఆలయ డైరెక్టర్ బుచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): పర్యావరణ పరిరక్షణకు ప్రజలు కృషి చేయాలని ఎంపీపీ లింగాల నిర్మల అన్నారు. బెజ్జంకి, తోటపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు.

తొగుట(దుబ్బాక): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి అన్నారు. గుడికందుల నర్సరీలో బుధవారం సర్పంచ్ మల్లయ్యతో కలిసి 75 మొక్కలు నాటారు.

హుస్నాబాద్‌రూరల్: హరితహారంలో భాగంగా బుధవారం ఎంపీపీ లకావత్ మానస మీర్జాపూర్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికి ఐదు మొక్కలను నాటించాలని, పొలాలగట్లపై, వీధి రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): హరితహారంలో ప్రజలు భాగస్వాములై మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీపీ మాలోతు లక్ష్మి అన్నారు. మండలంలోని చౌటపల్లి, జనగామ, అంతక్కపేట గ్రామాల్లో బుధవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో 75 మొక్కల చొప్పున నాటించారు.

గజ్వేల్‌రూరల్: మేరీ మట్టి మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం గజ్వేల్‌లోని డిగ్రీ బాలుర కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 50 మొక్కలు నాటారు. హరిత కళాశాలగా మార్చుకోవడమే లక్ష్యంగా మొక్కలు నాటుతున్నామన్నారు.

కొండపాక(గజ్వేల్): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

మద్దూరు(హుస్నాబాద్): రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతీ యూత్ కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్కూరి కమాలకర్‌యాదవ్ అన్నారు. బుధవారం దూల్మిట్ట మండల కేంద్రంలో 63వ యూత్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈనెల 15వ తేదీ నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బైరాన్‌పల్లి సర్పంచ్ బండి శ్రీనివాస్‌గౌడ్, బెక్కల్ సర్పంచ్ కూకట్ల బాలరాజుయాదవ్, కొండాపూర్ ఎంపీటీసీ ఇస్లావత్ నముకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పోషకాహార లోపాన్ని నివారించాలి

గజ్వేల్‌రూరల్: పిల్లలో పోషకాహార లోపాన్ని నివారించాలని గజ్వేల్ సెక్టార్ సీడీపీఓ వెంకట రాజమ్మ సూచించారు. బుధవారం మండలంలోని అహ్మదీపూర్ అంగన్‌వాడి కేంద్రాన్ని ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారుల బృందం సందర్శించారు. తీవ్ర పోషకాహార లోపాలున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణయ్‌రాజ్, సూపర్‌వైజర్లు భవాని, శోభ, టీచర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేవారికి తెలంగాణ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద చేయూత అందించేందుకు శ్రీకారం చుట్టింది. అక్కన్నపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన పలువురు దరఖాస్తు చేసుకున్నారు. 172 దరఖాస్తులు వచ్చినట్లు మండల పరిషత్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ మల్లేశం తెలిపారు.

◆ కులవృత్తికే పరిమితం కావొద్దు

చిన్నకోడూరు(సిద్దిపేట): బైండ్ల సంఘం సభ్యులు ఐకమత్యంగా ముందుకు సాగాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ సూచించారు. చిన్నకోడూరులో బుధవారం బైండ్ల సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తోందన్నారు. బైండ్ల కులస్తులు కులవృత్తికే పరిమితం కాకుండా తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కనకయ్య, అధ్యక్షుడిగా నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా చిన్న నర్సయ్య, కోశాధికారిగా రాజయ్య, సలహాదారులుగా సేనాపతి, రాంబాబులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీలు శారద రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

సిద్దిపేటకమాన్: స్వచ్ఛ్ సిద్దిపేటగా రూపొందించేందుకు ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. నడుస్తూ చెత్త తొలగిద్దాం కార్యక్రమంలో బుధవారం పట్టణంలోని 38వ వార్డులో వార్డు కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మంతో కలిసి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బర్ల మల్లికార్జున్, దీప్తినాగరాజు, బందారం శ్రీలతరాజు, వంగ రేణుక తిరుమల్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, గుడాల సంధ్యశ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ మురికి కాలువల్లో చెత్త వేయొద్దు

హుస్నాబాద్: మురికి కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ వస్తువులను వేయకుండా మున్సిపల్ వాహన సిబ్బందికి అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని 3వ వార్డులోని మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులతో తొలగించి శుభ్రం చేయించారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కార్మికులను ఆదేశించారు.

◆ కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మద్దూరు(హుస్నాబాద్): క్వింటాల్‌కు రూ.140 కమీషన్ పెంచడంపై రేషన్ డీలర్లుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మద్దూరు మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మద్దూరు రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఎండి కరీం మాట్లాడుతూ డీలర్లకు కమీషన్ పెంచడం సంతోషకరమన్నారు. అనంతరం నూతన తహసీల్దార్ అనంతరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం సెక్రటరీ దాసరి వేణు, డీలర్లు బాలకృష్ణ, భూపతిరెడ్డి, మంజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సంతోష్

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మిద్దె సంతోష్ ఎన్నికయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా బాలయ్య, బాలకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా స్వామి, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా నరేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహ్మద్ షఫీ, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా శివలింగం, సోషల్ మీడియా అధ్యక్షుడిగా బెజ్జరమైన ప్రవీణ్, యూత్ అధ్యక్షుడిగా బెజ్జరమైన కృష్ణను ఎన్నుకున్నారు.

◆ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఫంక్షన్‌హాల్ వద్ద వంటగది కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, ఉపసర్పంచ్ దేవేందర్, నాయకులు మాధవరెడ్డి, సుఖేందర్‌రెడ్డి, నర్సింహులు, స్వామి, పరమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆయుర్వేద ఉచిత వైద్యశిబిరం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇటిక్యాల ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో దౌలాపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదిలక్ష్మి, డాక్టర్ దీపాంజలి, నాయకులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు టై, బెల్టుల అందజేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని గ్రామ సర్పంచ్ భానుప్రకాష్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని తిగుల్ ప్రాథమిక పాఠశాలలో దాత కోన్యాల వెంకట్‌రెడ్డి విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్తయ్య, నందిని, శ్వేత, వసంత, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఎల్లమ్మ దేవాలయానికి విరాళం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్ పరిధిలోని 2వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ దేవాలయానికి మెదక్ డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి బుధవారం రూ.51 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ప్రవీణ్, పీఏసీఎస్ డైరెక్టర్ పోచయ్య, నాయకులు రవి, మహిపాల్‌రెడ్డి, స్వామి, రాము, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదు

తొగుట(దుబ్బాక): ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి, ఎల్లారెడ్డిపేట, తుక్కాపూర్ గ్రామాల్లో బుధవారం పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే దుబ్బాక అభివృద్ధిని విస్మరించారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎల్లారెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయం భూ రాజేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తులకు తాగునీరు అందించేందుకు మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. కోహెడ మండలం పర్వేద గ్రామస్తుడు గవ్వ రాజిరెడ్డి ట్యాంక్ నిర్మాణానికి ముందుకు వచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవసాని సుశీల, ఉపసర్పంచ్ సకీబాబా, మార్క చంద్రయ్య, నర్సింహారెడ్డి, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

◆ ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మర్కూక్(గజ్వేల్): మండలంలోని గంగాపూర్‌కు చెందిన రైతు శ్రీనివాస్ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు కిందికు వెలాడుతున్నాయని ఏఈకి పలుసార్లు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

◆ పశువులకు వ్యాధి నివారణ టీకాలు

మర్కూక్(గజ్వేల్): సీజనల్ వ్యాధుల నివారణకు పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ పాండుగౌడ్ రైతులకు సూచించారు. మండలంలోని పాములపర్తిలో పశువులకు గాలికుంటు, లంపి స్కిన్ వ్యాధుల నివారణకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రమేష్, సిబ్బంది మధుర, శ్రీలత, లక్ష్మీ, అరుణ్‌కుమార్, రవీందర్ రైతులు పాల్గొన్నారు.